సాక్షి
హైదరాబాద్, శనివారం, 5, అక్టోబర్, 2024

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న నరహరి

లక్డీకాపుల్ : రాజ్యాధికారంతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని బీసీ కులాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు నరహరి అన్నారు. తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్ అధ్యక్షతన లక్డీకపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో 'బీసీలకు రాజ్యాధికారం రాజకీయ సమాలోచన' అనే అంశంపై శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరహరి మాట్లాడుతూ.. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను ముఖ్యమంత్రి చేద్దామన్న కనీస ఆలోచన గత పాలకులకు రాకపోవడం బాధాకరమన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ మేధావి శంకరన్న, బీసీ సమాజ్ వ్యవస్థాపకుడు సంగెం సూర్యారావు, ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల వీరన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హరీథ్ రూథా, జగదీష్ యాదవ్, సంధ్యారాణి, విజయ్ మహేంద్ర, అరుణ్ కుమార్, విజయ్ కుమార్, విజయ్ యాదవ్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తాం


సమావేశంలో పాల్గొన్న యాదవ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణలో పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహిస్తామని ఎమ్ఎస్ఎమ్ఈ అధికారి హరిణి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యాదవ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు బీసీల ఆవశ్యకత గుర్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మన ధృక్పథంతో ప్రతిధ్వనిస్తుందని, ప్రభుత్వాలు ఎమ్ఎస్ఎమ్ఈలకు గణనీయమైన నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవ్ చాంబర్ ఆఫ్ కామర్స్, స్టార్టప్‌లు ఈ యేడు ఫిబ్రవరి 29న ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రకాశ్ యాదవ్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణా యాదవ్, వెంకట్, నికేతన్, శెట్టి హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ అవినీతిపై విచారణ జరిపించాలి


అధికారిపై చర్యలు తీసుకోవాలని పోస్టర్ రిలీజ్ చేస్తున్న ఓయూ జేఏసీ నేతలు

పంజగుట్ట: బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ చేసిన అవినీతిపై విజిలెన్స్ లేదా ఏసీబీతో విచారణ జరిపించాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో అవినీతి చేసిన అధికారులను ప్రజా పాలనలో కూడా అటు ఉన్నత విద్యామండలిలో వైస్ చైర్మన్‌గా కొనసాగిస్తూనే, బాసర ట్రిపుల్ ఐటీకి ఇన్‌చార్జి వీసీగా నియమించడం సరికాదని వెంటనే సీఎం స్పందించి అతన్ని ఆ పదవుల నుంచి తొలగించి విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నేతలు ప్రశాంత్, ఆంజనేయులు గౌడ్, రంజిత్, ప్రవీణ్ కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

కాలిఫోర్నియాలో క్లీన్ మౌంటైన్ హౌస్ క్యాంపెయిన్



సాక్షి, సిటీబ్యూరో: మహాత్మా గాంధీ జయంతి నేపథ్యంలో యూఎస్ఏ ఎన్ఆర్ఐ పేరెంట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో యూఎస్ఏ కాలిఫోర్నియాలోని ఇండియా ది మౌంటైన్ హౌస్ వేదికగా కమ్యూనిటీ సరీస్ ప్రోగ్రాం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్, ఆంధ్రప్రదేశ్, డిస్ట్రిక్ట్ 316డి'కి చెందిన ఎల్ఎన్ కుముదాకర్ చిట్టూరి, తణుకు (ఏపీ)కి చెందిన సూర్యనారాయణ, బెంగుళూరుకు చెందిన టీ.గోపాల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా యూఎస్ఏలో పని చేస్తున్న భారత సంతతికి చెందిన నైపుణ్యకారుల తల్లిదండ్రుల గ్రూప్‌లోని 42 మంది సభ్యులు క్లీన్ మౌంటైన్ హౌస్ క్యాంపెయిన్‌లో ఆసక్తిగా పాల్గొని స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మౌంటైన్ హౌస్ ప్రెసిడెంట్ రొటేరియన్ సియెరా ఎడ్వర్డ్, మౌంటైన్ హౌస్ మ్యాటర్స్ మ్యాగజైన్ యజమాని, సంపాదకుడు బ్రయాన్ హారిసన్ పాల్గొని వలంటీర్లను ప్రోత్సహించారు. ఈ క్లీన్ మౌంటైన్ హౌస్ క్యాంపెయిన్‌లో మౌంటెన్ హౌస్ రొటేరియన్ హ్యారీ ధిల్లాన్ వలంటీర్లకు మార్గనిర్దేశం చేశారు. అంతేగాకుండా కార్యక్రమ నిర్వహణకు అవసరమైన పరికరాలను అందించారు.


వైభవంగా దేవీ శరన్నవరాత్రులు


హరిహర క్షేత్రం స్వరాజ్‌నగర్ బోరబండలో ..

బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ భ్రమరాంబికా అమ్మవారు శుక్రవారం గాయత్రీదేవీగా దర్శనమిచ్చారు. అనంతరం నిర్వహించిన చండీహోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫిలింనగర్ దైవసన్నిధానంలోని రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవీగా, బంజారాహిల్స్ రోడ్ నెం. 12 విశ్వసాయి మందరంలోని కనకదుర్గా గాయత్రీ దేవీగా, ఫిలింనగర్ మాగంటి కాలనీలోని కనకదుర్గా అమ్మవారు మహాగౌరీ దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చనల్లోనూ భక్తులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని సైతం పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.


శ్రీనగర్‌కాలనీలో భ్రమరాంబికా అమ్మవారు


ఫిలింనగర్ దైవసన్నిధానంలో..


ఫిలింనగర్ మాగంటి కాలనీలో..


గాయత్రీదేవీగా బంజారాహిల్స్ కనక దుర్గా అమ్మవారు..


పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి


శ్రీ గజలక్ష్మి అలంకారంలో జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డు..!

ఫైలట్ ప్రాజెక్టు కింద లక్ష్మీనగర్ ఎంపిక
నాలుగు బృందాల ఏర్పాటు
మూడు రోజుల పాటు సర్వే


ఖైరతాబాద్‌లోని లక్ష్మీనగర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: తెలంగాణ ప్రభుత్వం ఆధార్ కార్డు తరహాలో ప్రతి కుటుంబానికి ఓ డిజిటల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్డుతోనే రేషన్, ఆరోగ్యకార్డులు, పింఛన్ తదితర ప్రభుత్వ పథకాలన్నీ ప్రామాణికం కానున్నాయి. ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలో ఖైరతాబాద్ బడా గణేశ్ సమీపంలోని లక్ష్మీనగర్‌ను ఎంపిక చేశారు. ఇక్కడున్న 500 నివాసాల పూర్తి డేటాను ఖైరతాబాద్ నియోజకవర్గ జీహెచ్ఎంసీ అధికారులకు అందజేశారు. ఈ డిజిటల్ గుర్తింపు కార్డు ఫ్యామిలీ పెద్దగా మహిళ పేరిట ఇస్తారు. గురువారం సర్వే ప్రారంభం కాగా శనివారం ముగుస్తుంది. ఇందుకోసం నాలుగు బృందాలు ఏర్పాటు చేయగా ఒక్కో బృందంలో ఇద్దరిని నియమించారు. ఇంటి పెద్ద, ఇంటి నెంబర్, ఫోన్ నెంబర్ తదితర మొత్తం కుటుంబ జాబితాను సర్వే చేసి బృందానికి అందజేశారు. ఈ అధికారులు ఆ ఇంటికి వెళ్లి కుటుంబ పెద్ద పేరు నిజమేనా..? కాదా..? ఆ ఇంట్లో ఎంతమంది ఉంటున్నారు..? కుటుంబ స్థితిగతులు, నేపథ్యం తదితర వివరాలు నమోదు చేసుకుంటారు. తర్వాత నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారు. పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన సర్వే విజయవంతం అయితే మిగితా ప్రాంతాలకు కూడా విస్తరించనున్నారు. శనివారం సాయంత్రానికి సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పైలట్ ప్రాజెక్టు ఖైరతాబాద్ నియోజకవర్గ అధికారి, సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు. సర్వే ముమ్మరంగా జరుగుతుందని, ప్రతిరోజూ తీరును పరిశీలిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సర్వేతో ఇంటి స్థితిగతులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు పూర్తిగా తెలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని పోచమ్మ ఆలయం ధర్మకర్తల మండలి నియామకానికి డిప్యూటీ కమిషనర్ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఆసక్తి గలవారి నుంచి దరఖాస్తు చేసుకోవాలని దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 20 రోజుల్లోగా కాచిగూడలోని దేవాదాయ శాఖ సహాయక కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని పేర్కొన్నారు.

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

లిబర్టీ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే న నెరవేర్చాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పీవీ రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, రైతులను ఆదుకోవాలని, రైతు భరోసా డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. అధికారంలోకి రాకముందు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు మరో 14 హామీలు కూడా ఇచ్చిందని వాటిని కూడా తక్షణమే అమలు చేయాలని కోరారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం


టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

లిబర్టీ: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అఖిల భారత సంఘటిత, అసంఘటిత ఉద్యోగులు, కార్మిక సంఘం నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందించి సన్మానించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి, ఆటో విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేశ్, తదితరులు ఉన్నారు.

సమాజ్ వాది పార్టీ ఆవిర్భావ దినోత్సవం


చీరలు పంపిణీ చేస్తున్న కల్యాణ్ యాదవ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో సమాజ్‌వాది పార్టీ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ ఆ పార్టీ నేత దండుబోయిన నిత్య కల్యాణ్ యాదవ్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ డివిజన్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 5 దుర్గా భవానీ నగర్ బస్తీలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. తెలంగాణ మాదిగ దండోరా ఫౌండర్ ప్రెసిడెంట్ నర్సింగ్ రావు, బస్తీ నేత శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు

నేడు వెంకటస్వామి జయంతి వేడుకలు

లిబర్టీ: మాజీ కేంద్రమంత్రి, బడుగు బలహీన వర్గాల కోసం కృషి చేసిన జి.వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సదానంద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లిబర్టీ సమీపంలో ఉన్న వెంకటస్వామి విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు జరిగే వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నట్లు తెలిపారు. జి.వెంకటస్వామి తనయుడు ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ తదితరులు కూడా పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ ఆటోల కదలికలపై దృష్టి పెట్టాలి


మాట్లాడుతున్న ఖైరతాబాద్ జెడ్సీ అనురాగ్‌జయంతి

బంజారాహిల్స్: ప్రతి స్వచ్ఛ ఆటోకు తప్పని సరిగా మ్యాపింగ్ రూట్ ఉండాలని, సదరు ఆటో కాలనీ, బస్తీకి ప్రవేశించినప్పటి నుంచి డంప్‌యార్డుకు వెళ్లేదాకా కదలికలపై దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో సర్కిల్–12, 13, 14, 17, 18 డీఎంసీలు, ఏఎంఓహెచ్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రిపూట వీధి వ్యాపారులు, షాపులు మూసివేసే సమయంలోనే అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఆటోల ద్వారా తరలించేందుకు సూపర్‌వైజర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల ఉదయం చెత్త బారి నుంచి కొంత బయటపడవచ్చన్నారు. స్వచ్ఛ ఆటోలు ఇప్పటిదాకా చెత్త సేకరించని ఇళ్లను గుర్తించాలన్నారు. వల్లర బుల్ గార్బేజ్ పాయింట్స్ లేకుండా చూసుకోవాలని సూచించారు.

ఆకృతి దసరా ఎగ్జిబిషన్ ప్రారంభం



నగరంలోని తాజ్ కృష్ణలో శుక్రవారం ఆకృతి దసరా స్పెషల్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. దీన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ శశినాథ తెలిపారు. – బంజారాహిల్స్

మానసిక వ్యాధులపై అవగాహన ఉండాలి

శ్రీనగర్‌కాలనీ: మానసిక వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, మానసిక వ్యాధిగ్రస్తులకు భరోసా కల్పిస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపాలని ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రకుమార్ అన్నారు. ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అలాగే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 10వరకు అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహించనున్నట్లు ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, ఆర్ఎంఓ ఫణీకాంత్, డాక్టర్ వివాశ్వన్, డాక్టర్ ఓమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సితార గోల్డ్ ఎక్స్‌పో



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్ దక్కన్ హోటల్‌లో సితార ఉమెన్స్ గోల్డ్ అండ్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌ను సినీ నటి వర్షతో పాటు పలువురు మోడల్స్ శుక్రవారం ప్రారంభించారు. మహిళల వజ్రాభరణాలను ప్రత్యేకంగా ఎక్స్‌పోలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన బంగారు, వజ్రాభరణాలను ప్రదర్శిస్తామని, రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని వారు తెలిపారు.

6న బతుకమ్మ వేడుకలు

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ, మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆప్ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునగౌడ్ తెలిపారు. హైదరాబాద్ లిబర్టీలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 6న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజాలోని ఆమ్ ఆద్మీ పార్టీ, మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆప్ డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష్మి, జిల్లా నాయకులు ఫర్‌హత్ ఉన్నిసా, మౌనికా తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

వెంగళరావునగర్ : స్నేహం పేరుతో యువతిని నమ్మించి నగ్నంగా వీడియో కాల్స్ చేయాలంటూ బెదిరిస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన యువతి కుటుంబ సభ్యులతో కలిసి మధురానగర్ పీఎస్ పరిధిలో నివసిస్తుంది. రెండేళ్ల కిందట ఆమె ఇంటర్ చదువుతున్న సమయంలో లోకేశ్ అనే యువకుడు ఆమె స్నేహితురాలి ద్వారా ఫోన్ నెంబర్ తీసుకుని తనది కూడా మనిద్దరిది ఒకటే గ్రామం అని పరిచయం చేసుకున్నాడు. దాంతో ఇరువురు స్నేహితులయ్యారు. ఆమె తన పర్సనల్ విషయాలు, వీడియోలు కూడా అతనితో పంచుకుంది. ఆమె వీడియోలు, చాటింగ్స్ అన్నీ లోకేష్ రికార్డు చేశారు. గతేడాది వేసవిలో అతను ఆమెకు ఫోన్ చేసి తనకు నగ్నంగా వీడియోకాల్ చేయాలని, లేకుంటే నీ పర్సనల్ ఫొటోలు బంధువులందరికీ పంపుతానని బెదిరించాడు. ఈ విషయాన్ని ఆమె తన సోదరుడికి చెప్పగా అతను ఆమె ఫోన్ నెంబర్ మార్చాడు. గత నెలలో ఆమె ఇన్‌స్టాగాం వాడుతుందని తెలుసుకుని అమ్మాయిలాగా ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి చాటింగ్ చేశాడు. మరోసారి ఆమెను నగ్నంగా వీడియోకాల్ చేయాలని బెదిరించగా ఒప్పుకోకపోవడంతో ఈనెల 1న యువతి పర్సనల్ ఫొటోలను ఆమె బంధువులకు పంపాడు. దాంతో ఆమె 2న ఆత్మహత్య చేసుకునేందుకు ట్యాంక్‌బండ్‌కు వెళ్లి మనసు మార్చుకుని తన సోదరుడికి చెప్పింది. దీంతో సోదరుడు లోకేష్‌ను అడగ్గా తన స్నేహితుడు పంపాడని బుకాయించాడు. తనను వేధిస్తున్న లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆమె శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు క్వారీ మైదానంలో బతుకమ్మ వేడుకలు

రహమత్‌నగర్ : ఎస్పీఆర్‌హిల్స్ క్వారీ మైదానంలో శనివారం (నేడు) బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ సాయంత్రం 5 నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని డివిజన్‌లోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం

రహమత్‌నగర్ : మిలాద్–ఉన్–నబీ పురస్కరించుకుని ఎస్పీఆర్‌హిల్స్‌లోని కమలానగర్ చిల్లాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం నిర్వహించారు. ఖాన్కా–ఏ–మహ్మదీ అజ్మేరి సుస్రతి సౌజన్యంతో కమలానగర్ బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ సమక్షంలో చేపట్టారు. వివిధ బస్తీలకు చెందిన ముస్లింలు, మసీదు కమిటీ సభ్యులు, మదర్సా విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం


మహమ్మద్ జావిద్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ జావిద్ నియామకమయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ మోసిన్ ఖురేషి శుక్రవారం మహమ్మద్ జావిద్‌కు అందించారు. తనకు పదవి అప్పగించిన పార్టీ అధిష్టానానికి, చైర్మన్ మోసిన్ ఖురేషికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న భరటనాట్య ప్రదర్శన



బంజారాహిల్స్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా జూబ్లీహిల్స్‌లోని శ్రీసీతారామస్వామి ఆలయంలో భరతనాట్య కళాకారిణి ఐశ్వర్యవల్లి కాకులపాటి చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక కీర్తనలకు ఆమె చేసిన సంప్రదాయ నృత్యం వీక్షకులను కట్టిపడేసింది. ఆమె ప్రముఖ నాట్య గురు మధురై ఆర్ మురళీధరన్ శిష్యురాలు.

హైదర్‌గూడలో పోస్టర్ల కలకలం

కాచిగూడ: హిమాయత్‌నగర్‌లోని తెలుగు అకాడమీ, హైదర్‌గూడలో వెలిసిన గ్రూప్ –1 పోస్టర్లు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు పోటీ పరీక్షలకు ప్రామాణికం కాదని, ప్రభుత్వం కోర్టుకు చెప్పిన నేపథ్యంలో వాటిని ఎవరూ కొనవద్దు..చదువకండి అని ఉన్న పోస్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు అంటించారు. గ్రూప్–1లో 150 ప్రశ్నలు తయారు చేయలేని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎందుకు అంటూ.. సిగ్గు.. సిగ్గు టీజీపీఎస్సీ తప్పులతో నిరుద్యోగులకు ఎన్ని తిప్పలు అంటూ పోస్టర్లు అతికించారు. సమాచారం అందుకున్న నారాయణగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాటిని తొలగించారు. పోస్టర్లు అంటించినవారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

యురోపియన్ చెస్ క్లబ్ పోటీలకు ఎంపిక

శ్రీనగర్‌కాలనీ: యురోపియన్ చెస్ క్లబ్ పోటీలకు ఏకాగ్ర చెస్ అకాడమీ సూపర్ ట్విన్స్, వరల్డ్ టాప్‌ర్యాంకర్స్ అమయ అగర్వాల్, అనయ్ అగర్వాల్ ఎంపికవ్వడం గర్వకారణంగా ఉందని ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు, చీఫ్ కోచ్ చైతన్య అన్నారు. జూబ్లీహిల్స్‌లోని అకాడమీలో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 19న సెర్బియాలో జరగనున్న చెస్ క్లబ్‌కు అమయ అగర్వాల్, అనయ్ అగర్వా పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పనాషా అగర్వాల్, కోచ్ భరత్, శీతల్ పాల్గొన్నారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203